


# నారయ్య

ఆర్.యం. చిదంబరం

గుండెలో పీచుపీచుమంటున్న భయం. ఒంట్లో వణుకు - బెదురుగా, గరిమనాభి లేనట్టు చూపులు -

అలా, నారయ్య స్కూలు కాంపౌండు దాటి బయటపడ్డాడు. ఉన్నట్టుండి కాళ్లు నడవటం మానేస్తా యేమోనన్న అనుమానం -

జీవితంలో మొదటిసారిగా అతను తప్పుపని చేశాడు - నీతివిరుద్ధమైన పని. అందుకే - ఈ అనుభూతి... మూడోగంట కొట్టి పదినిముషాలైంది. ప్రార్థన పూర్తయి పాఠాలు మొదలుపెట్టారు. పాపకు అప్పుడే నిజం తెలిసిరాదు. పరధ్యానంగా మెడ తడుముకుంటే ఉలిక్కిపడుతుంది. తిన్నగా టీచరుకు విషయం వివరిస్తుంది.

స్కూల్లో, అలాంటి అఘాయిత్యం, పగలు దోపిడి జరిగాయంటే ఎవరూ సహించరు. హెడ్మాస్టరు దగ్గ ర్నుండి, బంట్రోతుదాకా అందరూ ఎగిరి గంతులేస్తారు. ఒక్కొక్క విద్యార్థిని పిలిచి నిలదీసి గదమా యిస్తారు. అడ్డు ప్రశ్నలు వేస్తారు. కళ్ళెర్రజేసి బెదిరిస్తారు.

'కాని అదెక్కడ దొరుకుతుంది?' అని నవ్వుకున్నాడు నారయ్య. అతని చొక్కాజేబు బరువుగా ఉంది... అదక్కడుంటే ప్రమాదం. ఇల్లు చేరుకున్నాక ఎక్కడైనా దాచేయాలి. అప్పుడు నిజాన్ని కనుక్కోవటం బ్రహ్మాతరంకూడా కాదు...నారయ్య ఎదురుపడ్డ హోటలుకుపోయి టీ తాగివచ్చాడు. మనసు కాస్త స్థిమితపడింది. కలవరం తగ్గింది. చుట్ట కాలుస్తూ నెమ్మదిగా అడుగులు వేయసాగాడు.

తను చేసిన పని అన్యాయమని తెలుసు. అలా చేయవలసివస్తుందని కల్లోకూడా అనుకోలేదు. పరిస్థితులు, కోరికలు ఒక్కసారిగా విజృంభించి అతన్ని బలవంతంగా ఊబిలోకి దింపాయి. మంచివాడు చెడ్డతనాన్ని ఎన్నడూ ప్రేమించడు. నారయ్య జనార్దనంగారికి ద్రోహం చేశాడంటే కారణాలు కత్తుకట్టాయి. ఊహలో కూడా అతను యజమాన్ని వంచించాలనుకోలేదు.

చిన్నచిన్న అడుగులచప్పుడు. త్వరగా తరుముకొస్తున్న చప్పుడైంది...భయంతో గిరుక్కున వెనక్కి తిరిగాడు...ఏం లేదు...అంతా భ్రమ -

'అమ్మ దొంగా!...నా వస్తువు ఇచ్చేయ్....ఉండు! నిన్ను పోలీసులకు పప్పజెపుతాను' అని పాప గర్జిస్తే - దారిలో అటకాయిస్తే...

నారయ్య చిత్రంగా నవ్వుకున్నాడు.

అలా ఎన్నటికీ జరగదు. దాచిఉంచినంత కాలం అబద్ధం నిజంగా చలామణి అవుతుంది...అసత్యాన్ని కనుక్కుంటేమాత్రం చాలదు. దాన్ని రుజువుచేయాలి. సాక్ష్యాలు తీసుకురావాలి - కొండను త్రవ్వి ఎలుకను పట్టినట్టు....అయినా, జనార్దనంగార్ని మోసగించటం తన వినాశానికే వచ్చింది....తన్ను ఏ పరిస్థితుల్లో ఆయన ఆదరించింది మర్చిపోయాడన్నమాట....

నారయ్య దీర్ఘంగా ఆలోచింపసాగాడు.

వరదలు వచ్చాయి. పంట నాశనమైంది. ఎక్కడా పని దొరకలేదు. ముసలితల్లి జబ్బుతో మంచమెక్కింది. మంచివాడికి రోజులు కావన్నారు. ఉన్న ఇల్లు నీటిప్రవాహంతో కదలిపోయింది. నారయ్యకు జీవితంమీద పెద్ద కోర్కెలేవీ లేవు. పెళ్లి చేసుకుని పిల్లలతో సంసారం చేయాలని అతనుకల్లో కూడా వాంఛించలేదు. ఒళ్లు వంచి పనిచేయటం, దొరికిన డబ్బుతో ముసలి తల్లిని సుఖపెట్టడం. అదే అతని లక్ష్యం—తల్లికోసం ఏ త్యాగమైనా చేయటానికి సంసిద్ధుడు.

కాని, ప్రకృతి బలపరీక్షకు రమ్మని సవాలు చేసింది. నారయ్యకెక్కడా పని దొరకలేదు. రెండు వందలు ఎలాగో అప్పుచేసి ఇల్లుకట్టాడు. తల్లికి కావలసిన వస్తువులు కొన్నాడు. చిన్న నులక మంచం—సింవెండిగిన్నెలు, నాలుగు చీరలు—ఇంకా అత్యవసరమైనవి... జాగ్రత్తగా ఉండమని హెచ్చరించి పనికోసం పట్నం చేరుకొన్నాడు.

పట్నంలోమాత్రం పని సులువుగా దొరుకుతుందా? .... నాలుగురోజులు కాళ్లరిగేటట్టు తిరిగాడు. అతని ముఖంలో అమాయకత్వాన్ని చూసిన కొందరు 'పనికి పనికిరావు .... పొమ్మ' న్నారు. తెచ్చుకున్న రెండు రూపాయలు ఖర్చైపోయాయి. ఏం చేయటానికి పాలుపోలేదు.

అలాంటప్పుడు అయిదో రోజున—

బరువుగా అడుగులువేస్తూ నడుస్తున్నాడు. పట్నంమీద పెట్టుకున్న ఆశలు కరిగిపోయాయి. కొంతదూరంలో స్కూలు పిల్లలు జట్లు జట్లుగా నడచిపోతున్నారు. ఓ అమ్మాయిమాత్రం అందరికంటె వెనక, నెమ్మదిగా, తమాషాగా నడుస్తోంది. లారీలూ, బస్సులూ అటూ యిటూ పరుగెడుతున్నాయి. పురాతననాగరికత నశింపుకాకూడదని కంకణం కట్టుకున్న ఎడ్లబళ్లకట్టడాలు మధ్య మధ్య లారీల పురోగమనాన్ని సాయశక్తులా అటకాయిస్తున్నాయి. తతిమా పిల్లలందరూ రోడ్డుకు ఎడంప్రక్కగా నడచిపోతుంటే, ఆ ఒక్క పెంకి పిల్లమాత్రం రోడ్డు మధ్యగా నడుస్తోంది.

'నేనే ఈ మోటార్లకు జడిసి వారగా నడుస్తుంటే, ఈ బుల్లెమ్మ ఎంత ధైర్యంగా నడుస్తోంది?' అని నారయ్య ఆశ్చర్యపోయాడు.

అలా అయిదు నిమిషాలు ఆమెను గమనిస్తూ నడిచాడు.

'అమ్మాయిగారూ! .... జాగ్రత్తగా నడవండి. ఇదుగో వచ్చేస్తున్నా!'

నారయ్య వెనక్కి తిరిగి ఆ మాటలు వచ్చిన దిక్కుగా చూశాడు. ఓ 'ఆసామీ' కిల్లీగొట్టు

37—వ పేజీ చూడండి

దగ్గర తీరిగ్గా సిగరెట్టు కాలుస్తున్నాడు .... అతనికి తెలిసింది. ఆ బుల్లెమ్మను స్కూలునుండి ఇతగాడు ఇంటికి తీసికెడుతున్నాడు. అలా అనుకుని మరి రెండడుగులు ముందుకు వేసేసరికి ఆ సంఘటన జరిగింది.

ఆ కొంటెపిల్ల ఎవర్నీ లెక్కచేయకుండా, రోడ్డు మధ్యగా నడచిపోతోంది. ఎదురుగా బస్సు—వెనక లారీ—పక్కన రెండెడ్లబండి .... బెదరిన ఎడ్లు గుడ్డిగా బండిని లాగేస్తున్నాయి. బస్సు బాణంలా వచ్చేస్తోంది. ఆలోచించేందుకు వ్యవధి లేదు. రెండడుగుల్లో ముందు కురికి ఆమెను ఒక చేత్తో లాఘవంగా ఎత్తేసి ఎడంపక్క కురికాడు. ప్రళయం పగిలినట్టు పెద్దరొదతో బస్సు ఆగింది. నారయ్య ఊపిరి పీల్చుకుందికి ఆగాడు. గుమిగూడిన జనం అతన్ని అభినందించారు..... ఇంతలో కిళ్లీకొట్టుదగ్గరున్న 'ఆసామీ' పరుగెత్తుకొచ్చాడు.

'నువ్వు నిజంగా దేవుడివయ్యా! .... అమ్మాయిగార్ని రక్షించావు. లేకపోతే నా గతేంకాను? నాపని ఊడటంసంగతి అటుంచి, జైలుకు పోవలసి వస్తుంది .... ఇంద .... సిగరెట్టు కాలుస్తావా? ... ఓహో! చుట్ట తప్పించి ఏదీ కాల్చవన్నమాట.'

నారయ్య తన బట్టలకేసి చూసుకున్నాడు. మాసి, అసహ్యంగా ఉన్నాయి. అందుకే తనకు వో సిగరెట్టుకూడా కొనుక్కుని కాల్చే యోగ్యత లేదని అతను తీర్మానించాడు గామోలు—నారయ్య సమాధానం చెప్పేలోగా, ఆ అమ్మాయి గదమాయించింది.

'చాల్లే అవతారం! .... నన్ను రోడ్డుమధ్య వదిలేసి నువ్వు సిగరెట్టు కాలుస్తున్నావు. ఇందుకేనా నాన్నారు నీకు జీతం ఇచ్చేది? అతను పరుగెత్తుకొచ్చి నన్ను పక్కకు తప్పించకపోతే నాగతేంకాను? .... అమ్మ ఏడుస్తుంది పాపం!'

నారయ్య ఆశ్చర్యంతో ఆమెకేసి చూశాడు. పదేళ్లకంటె ఎక్కువుండవేమో! .... గుండ్రటి ముఖం, కళ్లల్లో చిలిపితనంతోపాటు విజ్ఞాన క్రాంతులు — వందమందిని ఒక్కచూపుతో ఆజ్ఞాపించగల గంభీరత్వం—నడకలో ఉన్న ఠీవిని ఇదివరకే గమనించాడు. ఈ చిన్నపిల్లలో మంచి చెడ్డలు, జాలి, దయ, కోపం, అన్నీ సవ్యంగా ఎలా రూపం ధరిస్తున్నాయి? ఆలోచించి అతను సమాధానం కనుక్కోలేకపోయాడు. అదికాక, ఆ అమ్మాయి తను రోడ్డుమధ్యగా నడవటం తప్పని, అందు మూలంగానే ఈ ఆపద జరిగిందని ఒప్పుకోటం లేదు. అందుకు అవతారమే కారకుడని వాదిస్తోంది...

'నీ పేరేవిటి?' అనడిగింది నారయ్యను. చెప్పాడు.

'పద నారయ్యా! .... మా ఇంటికి పోదాం .... నాన్నగారితో జరిగినదంతా వివరించి చెప్పాలి ....'

'నేనెందుకు బుల్లెమ్మగారూ! నా మానాన నేను పోతాను. ఏదైనా పని దొరుకుతుందేమోనని పట్నంలో నాలుగురోజులుగా తిరుగుతున్నాను.'

ఆ అమ్మాయి కోపగించుకుంది.

'అలా, ఎవరిమానాన వారు పోయేందుకు వీల్లేదయ్యా! .... నీ దగ్గర డబ్బు లేదు. అందుక్కారణం నీకు పనిలేదు. అదంతా నాన్నారు చూసుకుంటారు .... పద—' అంటూ ముందుకు

# నారయ్య

27-వ పేజీ తరువాయి

సాగింది. అవతారం తలవంచుకుని అక్కడే నిలబడ్డాడు. నారయ్యను, ఆమెను వెంబడించాడు.

ఆ అమ్మాయి ఓ ఇంటిముందు ఆగింది. చుట్టూ ప్రహరీగోడ—బయట ఉన్న బోర్డును బట్టి ఆ ఇంటియజమాని జనార్దనంగారని తెలుసుకున్నాడు.

జనార్దనంగారికి నలభైఏళ్ల కెక్కువ వుండవు. చిరునవ్వుతో కూడిన ముఖం. ఒక్క చూపుతో, ఎదుటివాడి మనసులో ఉండే అభిప్రాయాన్ని పసిగట్టే నేర్పరితనం—చేతివేళ్లకున్న రాళ్ల ఉంగరాలు. మెడలో గొలుసు—బంగారు చెయినుతో రిస్టువాచి—సిల్కు చొక్కా—అన్నీ చూశాక ఆర్థికంగా ఆయన స్థితిగతులు ఊహించుకున్నాడు నారయ్య.

ఆ అమ్మాయి అంతా వివరించింది.

నారయ్య తనపరిస్థితి వివరించాడు.

'నా తల్లికోసం ఏమైనా చేస్తానండి .... అది సుఖంగా ఉండటమే నాక్కావలసింది. అదే కష్టపడి నన్ను అయిదో తరగతి దాకా చదివించింది .... అది బాధపడితే నేను సయించలేనండి ....' అని ఆయనముందు కూర్చుని కన్నీరు కార్చాడు.

'అంతే నారయ్యా! .... పట్నం అందంగానే ఉంటుంది. కాని గడుసుతనం ఉంటేనే కాని, కాలు మోపేందుకూడా చోటు దొరకదు. పాప ఎలాగూ నిన్ను తీసుకొచ్చింది. ఇంక నీ కొచ్చిన చిక్కు ఏమీ లేదు. మాయింటో పనిచేస్తూ ఉండిపో!'

నారయ్య ఆనందంతో కళ్లు మూసుకున్నాడు.

* * *

నారయ్య కిదంతా గుర్తుకు వచ్చేసరికి, గుండె చివుక్కుమంది. బలవంతాన నోరు నొక్కి ఉంచిన అంతరాత్మ "చురుక్కు" న పొడవ నారంభించింది. చేసిన తప్పును చేయిదాటకముందే సరిదిద్దుదామని వెనక్కి తిరిగి స్కూలువైపు నాలుగడుగులు నడిచాడు.

అంతే — మనసు మళ్లీ సింహాసనమెక్కి కూర్చుంది.

'మరి మీ అమ్మ సంగతేమిటి? అరవైయేళ్లు నిండాయి. వంటో శక్తి లేదు. మనసులో నరాలు లేవు. పనిచేసుకుని బతకలేదు. నిన్ను తల్చుకుని అలా కుక్కిమంచంలో పడుకుంటుంది .... అలాంటి ఆసహాయురాలు, ఎండకు మాడి, వానకు తడిసి, ఆశ్రయంలేక వీధమ్మటపడి తిరుగుతే నువ్వు సహించగలవా? జనార్దనంగారు మంచివారే! .... కాదనను. కాని, నీ కష్టాన్ని గ్రహించి ఆయన నీకు సాయంచేయలేకపోయారు .... కసిరి కొట్టారు. జ్ఞాపకం ఉంచుకో.'

నారయ్య కీహెచ్చరిక సమంజసంగా కనబడింది. వెనక్కి తిరిగి, తిరిగి ఇంటివైపు నడక ప్రారంభించాడు.

* * *

నారయ్య పనిలో ప్రవేశించి నెలరోజులైంది. కార్యక్రమం స్థిరపడింది. పొద్దున్న తొమ్మిది గంటలదాకా ఇంట్లో చిల్లరపనులు చేయటం — తరువాత పాపను స్కూలుకు తీసికెళ్లటం — పది గంటలకు బడి — ఆ తరువాత తోటపని — ఇంటి వెనక ఉన్న పూలతోటంటే జనార్దనంగారికి ప్రాణం. కొత్త కొత్త ఎరువులు, విత్తనాలు, అంట్లు కట్టడం, పూలమొక్కలకు శత్రువులైన క్రిమికీటకాలు—వీటినిగురించి ఎన్నో పుస్తకాలు చదివి ఆయన తెలుసుకుని ఆచరణలో పెట్టారు. నారయ్య కూడా శ్రమపడి ఆ తోటను పూల స్వర్గంలా చేశాడు. సాయంత్రం ఓ మూలగా నిలబడి తోటకేసి చూస్తుంటే అతనికి కొండంత గర్వం కలిగేది. రంగురంగుల, రకరకాలైన పూలు విచ్చి విరిసి నవ్వుతుంటే వళ్లు పులకరించేది. ఒక్కో పువ్వు ఒక్కోరకంగా ఉంటుంది. భగవంతుడు ఇంత ఖచ్చితంగా ఎలా సృష్టించగలుగుతున్నాడని ఆశ్చర్యపోయేవాడు.

'అది నారయ్యతోట — నాదికాదు.' అనేవారు. జనార్దనంగారు.

మూడుగంటలకు వెళ్లి పాపను ఇంటికి తీసుకు రావాలి. తరువాత మళ్లీ తోటపని.

అదీ అతని దైనందిన కార్యక్రమం.

ఆ యింటో అడుగుపెట్టేవరకూ అతను ప్రేమించింది ఒక్క తల్లిని మాత్రమే! ఇప్పుడతను, తల్లితో సమానంగా, ఆ యింటిని — అందులో ప్రతి వస్తువును, నివసించే ప్రతి వ్యక్తిని — ప్రేమించాడు. జనార్దనంగారు నెలకు ఇరవైరూపాయలు అతనితల్లికి పంపేవారు.

అలా ఆరు నెలలు గడిచాయి.

* * *

నారయ్య ఇల్లు చేరుకున్నాడు.

సుభద్ర హాల్లో కూర్చుని ఏదో పుస్తకం చదువుకుంటోంది.

---

ఆదాయపు పన్ను అధికారులకు ఒక ఉత్తరం అందింది. లేఖకుని ఊరూ, పేరూ లేని ఆ ఉత్తరంలో ఇలా ఉంది: "మూడు సంవత్సరాలనుంచి నేను పన్నులు ఎగవేస్తున్నాను. ఇప్పుడు నా అంతరాత్మ నన్ను బాధిస్తోంది. నిద్రపట్టటంలేదు. ఈ ఉత్తరంతో రు 500 కరెన్సీ నోట్లు పంపుతున్నాను. ఈ డబ్బు పంపిన తరువాత కూడా నిద్రపట్టకపోతే, మిగతా డబ్బు పంపుతాను."

షేక్ మస్తాన్ (బందరు)

---

## నాకాస్

నేటినుండి ఉబ్బసపు వ్యాధితో బాధపడ నవసరంలేదు. ఈ వ్యాధి నిర్మూలనకు గాను 30 సం॥ల పరిశోధనా ఫలితముగా లభ్య పరచుకొనబడి, పరమహంస క్రియలగు మూలికలతో తయారైన ఆయుర్వేదౌషధం. ఎంత మొండి వ్యాధికైనను తత్క్షణమే బాధ నివారింపజేయుటయేగాక కొంతకాలము సేవించిన తిరిగి చూపెట్టదు.

8 డో॥ రు. 3-75. పోస్టేజి ప్రత్యేకం.

ఇండియన్ మెడిసన్ హౌస్, విజయవాడ-2.

## డాక్టర్ వృత్తి చేయండి!

ఇంటిలో విరామంగా కూర్చొని పుంజేప్పుడు. పోస్టల్ ట్యూషన్ ద్వారా, హోమియోపతి చదువుకొని, గవర్నమెంటురిజిస్టర్డు కాలేజిద్వారా డిప్లొమా పొందండి. ప్రాస్పెక్టస్ ఉచితము.

వివరములకు వెంటనే వ్రాయండి.

INDIAN HOMOEOPATHIC COLLEGE (APW) JULLUNDUR CITY




సర్వ గర్భాశయ వ్యాధులను పోగొట్టి, ఆరోగ్యమును సంతానమును కలుగజేయును. అన్నిషాపుల దొరకును. సీసా 2-8-0

కృష్ణాలేబరేటరి బెజవాడ


# నారయ్య

నారయ్యగుండెలు గబగబ కొట్టుకున్నాయి. భయంతో, కళ్మషహృదయంతో ఆనాటివరకూ, ఆ యింటిగడప అత నెన్నడూ తొక్కలేదు. సుభద్రను చూసేసరికి అతని శరీరం జలకింది. చల్లటి ఆమె చిరునవ్వు అతనికి వేడిగాడ్పులా తగిలింది. అడుగుమీద అడుగువేస్తూ లోనికి పోయాడు. సుభద్ర తనముఖంలో కలుగుతున్న మార్పుల్ని గమనించకూడదన్న తాపత్రయంతో మరింత కంగారుపడి గోడను ఢీకొన్నాడు.

'అదేమిటి నారయ్యా! .... అలా దొంగలా నడుస్తున్నావ్? .... ఏమైంది? అలా చూస్తావేం?' అంది సుభద్ర నవ్వుతూ.

నారయ్య భయంతో, వెకిలిగా నవ్వాడు.

'అహ హ్హ... మరేం లేదం డమ్మగారూ! .... మరి .... మరి .... ఎండలోంచి నీడలో కొచ్చాను కదండి మరి .... కళ్ళు చీకట్లు కమ్మాయి. అంతేనండి' అన్నాడు మాటల్నిచేర్చి వాక్యాలు తయారుచేయటానికి ప్రయత్నిస్తూ.

'సరే కాని, పాపను భద్రంగా స్కూలుకు తీసికెళ్లావా? .... మెళ్లో గొలుసు, అదీ భద్రంగా ఉందా?'

నారయ్య ఉలిక్కిపడ్డాడు.

శూలంతో ఎవరో పొడిచి హింసిస్తున్నట్లయింది.

సుభద్ర రోజూ వేసే ప్రశ్న యిది. అందులో కొత్త ఏమీ లేదు.

'అదేమిటం డమ్మగారూ! .... అలా అడుగుతారు? నే నుండగా బుల్లెమ్మగార్ని ఎవ రంటగల రండి? చేతులు విరగ్గొట్టేస్తాను. అన్నీ భద్రంగా ఉన్నాయండి.'

ఇది నారయ్య మామూలుగా ఇచ్చే జవాబు.

కాని ఈనాడు? .... నోరు తెరవలేకపోతున్నాడు.

'మాట్లాడవేం? .... ఏ దొంగైనా కాజేశాడా ఏమిటి?'

నారయ్య అతి కష్టంమీద నవ్వాడు.

'అబ్బెబ్బే! .... అలా ఎన్నటికైనా జరుగుతుందాండి? .... అన్నీ భద్రంగా ఉన్నాయి.'

నారయ్య వడ్డించుకు తిన్నాడు.

అతనిలో రెండు తీవ్ర శక్తుల మధ్య పోరాటం జరుగుతోంది.

అరగంటతరువాత హాల్లోకి వచ్చేసరికి పక్కగదిలోంచి సుభద్ర గుర్రుపెడుతూ నిద్రపోతున్న శబ్దం వినపడింది.

టేబిలుమీద ఆ ఉత్తరం కనపడింది.

తన్ను నీతికి దూరంగా ఉండమని బోధించిన ఉత్తరం...

నారయ్య మళ్లీ ఆలోచనలో పడ్డాడు.

ఆ క్రితంరోజు సాయంత్రం అమ్మదగ్గర్నుండి ఉత్తరం వచ్చింది. అప్పుడప్పుడు ఆ ముసిల్ది ఏమైనా రాయిస్తుంది. నారయ్య వెంటనే జవాబు రాయటం అలవాటు .... కాని ఈ ఉత్తరం అలాంటిదికాదు.

'నిన్ను కష్టపెట్టేందుకే ఈ పాపిష్టి జన్మ ఎత్తాను. .... ఏంచేసేది చెప్పు? నువ్వు పంపే పదీ, ఇరవైలతో సుఖంగా ఉన్నా — కాని ఆ రెండొందల మాటేమిటి? నాలుగురోజుల్లో ఇల్లు వేలం వేస్తారట. నేను వీధిలో ఉండాల్సిందే. మొదట్లో నీకు రాయకూడ దనుకున్నా. కాని ఎవర్తో చెప్పుకోటం? రెండొందలు ఒక్కసారిగా ఇవ్వలేకపోతే వందైనా ఇమ్మంటున్నాడు నాయుడు — రెండు మూడు నెల లాగమని బతిమాలాను. కాళ్ళు పట్టుకున్నా. కాని 'ససేమిరా' వీల్లేదన్నాడు. అందుకే నీకు రాయిస్తున్నా. నా ఖర్మకు నన్ను వదిలేయి .... నువ్వు బాధపడకు.'

ఆ వూరి స్కూలు మేష్టరు అమ్మ మనసులో ఉండే బాధను చక్కగా వివరించి రాశాడు. నాయుడుదగ్గర రెండు వందలు అప్పుచేసి ఇల్లు కట్టిన మాట అతను మర్చిపోలేదు. కాని అప్పు తీర్చట మెలా? .... వడ్డీ కూడా పెరిగిపోతోంది. అతను మర్చిపోకుండా, గుర్తుకుతెచ్చుకుంటూ, రోజులు దొర్లించాడు... ఆఖరుకు ఆపద రానే వచ్చింది. డబ్బివ్వకపోతే జాలి, దయ లేకుండా "నాయుడు ముసిల్దాన్ని మెడపట్టి బయటకు గెంటుతాడు. అప్పుడు దాని గతేమిటి? తల్చుకునేసరికి గట్టిగా ఏడవాలనిపించింది. నడివీధిలో, ఇల్లు, వాకిలి లేకుండా దీనంగా ఆకాశంకేసి చూస్తూ ఏడుస్తూ నిలబడేతల్లిని తల్చుకుని కుమిలిపోయాడు."

ఆనాటిరాత్రి నిద్రలేకుండా అటూ ఇటూ పొర్లాడు. మర్నా డుదయం జనార్దనంగార్ని బతిమాలుకుందామని నిర్ణయించుకున్నాడు. వెలుగంటూ కనిపించేందు కదొక్కటే మార్గం.

ఆ మర్నాడు పొద్దున్న జనార్దనంగార్ని చూస్తే అతనికి భయంవేసింది. చిటచిటలాడుతూ, ఇంట్లో అందరిమీదా ఎగిరిపడుతున్నారు. పుస్తకాలు, షెల్ఫు, అన్నీ గాలిస్తున్నారు. నారయ్యకు సంగతి పూర్తిగా అర్థంకాకపోయినా, ఏదో వస్తువు పోయిందని మాత్రం తెలిసింది. చిరునవ్వులేని ఆయనముఖం చూడటం ఇదే మొదటిసారి. పాప వంటింట్లో తల్లిదగ్గర కూర్చుంది.

అదృష్టం నారయ్యమీద శీతకన్ను వేసింది. కాకపోతే అలాంటి స్థితిగతుల్లో ఆయన్ని సాయం అడగాలనిపించదు. నెమ్మదిగా వెళ్లి ఉత్తరం చూపించాడు. చదివాక టేబిలుమీద విసిరారు.

'అయితే ఏమంటావ్?' అనడిగారు.

'ఏదో తమ దయ! .... ఇన్నాళ్ళూ మీరే ఆదరించారు. కాపాడారు. ఈసారికూడా మీ దయకోసం ఎదురు చూస్తున్నా' అన్నాడు చేతులు నలుపుకుంటూ.

ఆయన కళ్లు చింతనిప్పు లయ్యాయి.

'ఏమయ్యా! .... ఇదేమన్నా ధర్మసత్రమనుకున్నావా? .... ఏదో పనిలేకుండా తిరుగుతున్నావు కదాని దయతల్చి నీకు ఆధారం చూపించాను .... క్రితంసారి మీ అమ్మకు నలభై పంపాను. అదే ఆఖరుసా రవుతుం దనుకున్నా. ప్రతిసారి అడిగితే ఎలాగయ్యా? .... ఇక్కడ ఖజానా మూలుగుతోం దనుకున్నావా? లేక మీ తాత ఏదైనా ఆస్తిరాసిచ్చి పోయా డనుకుంటున్నావా? నువ్విలాంటివాడివని తెలిస్తే, ఈ ఇంట్లో అడుగు పెట్టనిచ్చే

వాణ్ణి కాను. డబ్బు లేదు. వల్లకాడు లేదు. ముందు మూటా ముల్లె సర్దుకుని దయచేయి నీ జీతం బాకీ ఏదైనా ఉంటే సాయంత్రం వచ్చి లెక్క తేల్చుకో.'

నారయ్యకు దుఃఖం పొంగుకొచ్చింది. ఆపుకో లేక తోటలోకి పోయి ఏడ్చాడు. జనార్దనంగారు పొమ్మన్నందుకు అతనికి బాధలేదు. తల్లిగతి ఏమవుతుందనే భయం—ఏమీ జరగనట్టు, ఏమీ చేయకుండా ఉండేందుకు వీల్లేదు. చీకట్లో వెలుగుకోసం వెదికాడు. దొరకలేదు. ఆయన కోపంలో, తన కష్టనష్టాలు గమనించ అలా మాటల్ని చిత్తం వచ్చినట్టు వదలారు కాని, కోపం చల్లారాక నిజం తెలుసుకుని ఆదరిస్తారనే నమ్మకంతో ఎదురుచూశాడు.

గంట తరువాత ఆఫీసుకు వెళ్ళిపోయారు.

ఆ ఆశకూడా మంచులా కరగిపోయింది.

నారయ్య తొమ్మిదింటికి పాపతో స్కూలుకు బయలుదేరాడు. మనసంతా మబ్బులతో నిండిన ఆకాశంలా ఉంది. తల్లికి కనీసం వందైనా పంపి తీరాలి. అమ్మేందుకు తనదగ్గరేం లేదు. ఓ బంగారు ఉంగరం ఉన్నా బావుండిపోను. బంగారానికి మంచి ధర. పాప పదిగజాల దూరంలో నడుస్తోంది. నారయ్య పరధ్యానంగా నడుస్తున్నాడు. అతని కళ్లకు ఉన్నట్టుండి, ఆమె మెళ్లో ఉన్న బంగారు గొలుసు కనపడింది. ఆ గొలుసు ఉండటం పాప ప్రాణాలకే ముప్పని కొందరు సలహా యిచ్చినా, జనార్దనంగారు వినలేదు.

దురాలోచన కలగ్గానే, మనిషి మెదడు చురుగ్గా పనిచేస్తుంది. వివేకం నశిస్తుంది. ఆత్మ తన శక్తిని కోల్పోయి ఓ మూల పడుకుంటుంది. మనసు ఉపాయాలు చెప్తుంది. లాభనష్టాలు వివరిస్తుంది. చేస్తున్న చెడ్డపని ఏవిధంగా 'మంచిదో' వివరిస్తుంది. దురాలోచనను మనస్సులోనికి రానివ్వటమే దీని కంతకూ కారణం. అది ప్రధాన శత్రువు. ఇంటికి దూరంగా ఉంచినంతకాలం ఫరవాలేదు. లోనికి 'స్వాగతం' చెబితే లోయల అడుగుకు నెట్టివేస్తుంది.

నారయ్య ఆహ్వానించాడు.

ఆ క్షణంలో మరి గత్యంతరంలేదు. నీతి నిజాయితీలను శిఖరంమీద కూర్చోబెట్టి, పూజా పునస్కారాలు సాగిస్తే అటు తల్లిపీధిపాలౌతుంది. చకచక ముందుకు నడిచాడు. పాపతో ఏవో కబుర్లు ప్రారంభించాడు.

పాప స్కూల్లో అడుగుపెట్టేసరికి మెడ బోసిగా ఉంది. నారయ్య చొక్కాజేబు బరువుగా ఉంది. ఆ సంగతి ఆమె కింకా తెలియదు.

*　　　*　　　*

గడియారం రెండు కొట్టింది.

నారయ్య బయటికి వెళ్లటానికి సిద్ధమయ్యాడు.

సుభద్ర మేల్కొని ఆవులిస్తూ వచ్చి అతన్ని చూసి 'అప్పుడే ఎక్కడకు బయలుదేరావు నారయ్యా .... రెండైంది. అంతే. స్కూలు నాలుగ్గంటలకు కదా విడిచిపెట్టేది ?' అనడిగింది.

'ఇక్కడ ఏం పనిలేదండి. అందుకని నెమ్మదిగా నడుస్తూ అలా అలా తిరిగి నాలుగ్గంటలకు బడి చేరుకుంటానండి' అని బయటపడ్డాడు.

అది అబద్ధం—బడికి కొద్దిదూరంలో ఉన్న మార్వాడీ కొట్టు మూడింటికిగ్గాని తెరవరు. ఆ గొలుసు అమ్మి వందరూపాయలు అయినా తీసుకోవాలి. తతిమా వంద మాట తరువాత చూసుకోవచ్చు. కొట్టు దగ్గరయ్యేకొలది భయ మెక్కువయింది. జేబులో ఉన్న గొలుసు మణుగు బరువుతో శరీరాన్నే క్రుంగదీసింది. కొట్టుదగ్గర అయ్యగారికి తెలిసినవా రెవరైనా ఉంటే ? .... మార్వాడీ అప్పుడే దుకాణం తెరిచి దుమ్మూ, ధూళీ దులుపుతున్నాడు.

'సేటుగారికి దండాలు' అని పళ్లికిలించి గాజు పెట్టె దగ్గర కూర్చున్నాడు. మార్వాడీ ఒక్క చూపుతో, అతన్ని, అతని స్థితిగతుల్ని, మనో భావాన్ని గ్రహించి 'దండాల్ని' స్వీకరిస్తున్నట్టు తల నిలువునా ఆడించాడు.

నారయ్య గొలుసు బయటకు తీశాడు. నవ్వుతున్న పాప మెడతడిమిచూసుకుని ఒక్కసారిగా కెవ్వున కేకేసింది .... నారయ్య ఉలిక్కిపడి గాజు పెట్టెమీద గొలుసు జారవిడిచాడు. అతని మనసులో జరుగుతున్న సంఘర్షణ మార్వాడీ కేం తెలుసు ? తాపీగా తీసుకుని నాణ్యం పరీక్షించి 'యాభై రూపాయలు' అన్నాడు.

అతనికి గుండె ఆగినట్లయింది.

'అవునయ్యా ! .... దొంగసొమ్ముకు అంతకంటె ఎక్కు వెవరిస్తారు ? .... బంగారంకూడా మంచిది కాదు.'

'దొంగసొమ్ము' అన్న మాట గుండెల్ని గుండులా దూసుకుపోయింది.

చివరికి ఎలాగో వంద రూపాయలు దొరికాయి.

డబ్బు భద్రంగా దాచుకుని వెళ్లేసరికి బడి వదిలేశారు. పాప గేటుదగ్గర నిలబడుంది.

'ఆలస్యమైందే నారయ్యా ? ....' అనడిగింది.

పాప ముఖం వాడిన పువ్వులా ఉంది. కళ్లు రెండూ ఎర్రగా ఉన్నాయి. బుగ్గలమీద నీటిచారలున్నాయి. ఉండే ఉత్సాహం, కొంటెతనం ముఖం మీద మచ్చుకైనా లేవు.

'బుల్లెమ్మగారూ!....ఏడుస్తున్నారా? ఏమైంది?'

'ఇప్పుడు ఏడవటంలేదు కాని మధ్యాహ్నం ఏడ్చాను. మరి నవ్వుతానా ఏమిటి ? నా మెళ్లో గొలుసు పోయింది.'

'అయ్యయ్యో! .... ఎంతపని జరిగింది ! ఎవ డా దొంగవెధవ ? నా చేతికి దొరికితే చంపేస్తాను. పీక నులిమిపారేస్తాను. ఎప్పుడు పోయిందో గుర్తుందా ? బుల్లెమ్మగారూ ! .... నేను పొద్దున్న బడిదగ్గర విడిచిపెట్టేటప్పుడు ఉంది. బళ్లోనే పోయుండాలి.'

నారయ్య తెలివిగా నటించాడు.

'అంతే అనుకోవాలి. టీచరుతో చెప్పాను. అందర్నీ అడిగింది. ఎక్కడా దొరకలేదు.'

ఇద్దరూ ఇంటికి బయలుదేరారు. జనార్దనం గారు తన్ను అనుమానించరనే ధైర్యం నారయ్యకుంది. తిన్న ఇంటివాసాలు లెక్కపెట్టినందుకు అతనికి బాధగానే ఉంది. ఇల్లు చేరుకున్నాక సుభద్ర సంగతి తెలుసుకుంది.

''పోతే పోయింది .... ఏం చేస్తాం మరి ... మీ నాన్నగారు వద్దంటే విన్నారుకారు. అది మన



పొమ్మ కాదనుకుందాం. నువ్వు మొహం కడుక్కుని రా !' అంది. నారయ్యను ఆమె ఏమీఅడగలేదు.

ఆరుగంటలకు ఆఫీసునుండి వచ్చిన జనార్ధనంగారు అంతా విని మౌనంగా ఉండిపోయారు.

'నారయ్యా ! .... ఈ స్వెట్టరు నీకు సరిపోతుందేమో చూడు ! .... ఈ దుప్పటి, కంబళి నీకోసమే !' అంటూ ఓ పాకెట్టు అందించాడు.

'ఇవన్నీ నా కెందుకం డయ్యగారూ !'

'ఎందు కేవిటోయ్ ? .... ఇది శీతకాలం. జాగ్రత్తగా ఉండకపోతే జబ్బుచేస్తుంది. క్రితం నెల కొనిద్దా మనుకుని అశ్రద్ధ చేశాను.'

భర్తకు కాఫీ తీసుకొచ్చిన సుభద్ర ఏదో జ్ఞాపకంవచ్చి నాలి క్కరుచుకుంది.

'అరెరె ! .... పొద్దున్న వండిన పరమాన్నం నారయ్య కివ్వనేలేదు. పని తొందరలో పూర్తిగా మర్చిపోయాను ....' అంటూ పెద్ద కప్పునిండా పరమాన్నం తీసుకొచ్చి అతని కిచ్చింది.

'అన్నట్టు నారయ్యా ! .... చెప్పటం మర్చిపోయాను. ఏదో పిల్లల సినిమా వచ్చిందట. కాస్త పాపను తీసుకెళ్ళు బాబూ ! .... చంపుకుతింటోంది. పక్కింటాయనతో వెళ్ళమంటే, తల అడ్డంగా ఆడిస్తోంది. నీతో తప్పించి వెళ్ళదట.'

నారయ్య ఇంక అక్కడ నిలబడలేకపోయాడు. తల గిరగిర తిరిగింది.

*     *     *

గడియారం పదకొండు కొట్టింది.

నారయ్య పంపిన వందరూపాయలు ముసిల్ది అందుకుంది. వెంటనే నాయుడుదగ్గరకు వెళ్ళింది. నాయుడు విరగబడి నవ్వాడు. దిక్కులు దద్దరిల్లేటట్టు నవ్వాడు. ముసిల్ది భయంతో, ఆశ్చర్యంతో చూసింది.

'నన్ను మోసంచేద్దా మనుకుంటున్నావా ? .... ఈ తెల్ల కాగితంముక్క లెవరిక్కావాలి ? ఒక్క గంట వ్యవధి ఇస్తున్నా. వెంటనే ఆ రెండొందలు చెల్లించేయాలి. లేదా, మెడపట్టి బయటకు గెంటుతాను.'

'అయ్యో ! .... ఇది అధర్మం. అన్యాయం. ఇప్పుడే పోస్టతను ఇచ్చిపోయాడు. నా కొడుకు పంపాడు. అది కాగితంముక్క ఎలా అవుతుంది ?'

'ఓ ముసలిపీనుగా ! .... ఇంకా ధర్మం చావలేదు. ఇది నీ కొడుకు కష్టపడి సంపాదించిన సొమ్ము కాదు. ఎవర్నో మోసం చేశాడు. దొంగిలించాడు. ఇది దొంగ సొత్తు. అందుకే, కాగితం ముక్కైక్క విలువను కోల్పోయింది.'

నాయుడు మళ్ళీ వికటంగా నవ్వాడు.

పాప తలిదండ్రులతో అక్కడకు వచ్చింది.

'అవును నాన్నారూ ! .... అతను దొంగ. నా మెళ్ళో గొలును లాక్కున్నాడు. నేను చూసీ చూడనట్టు ఊరుకున్నాను. తరువాత మీతో చెప్పి జైలుకు పంపించవచ్చునని.' అంది ఉరిమి చూస్తూ పాప.

మార్వాడీ కంగారుపడ్డాడు.

'అరెరె ! .... జనార్ధనం సేటుగారి గొలుసా ? .. ఆ సంగతి మనకి తెలియదు. ఏదో పరోపకారం కోసం సాయంచేశాను... దొంగసొత్తు నేను కళ్ళతో కూడా చూడను. అది పాపం .... పాపం ! ..... ఈ వెధవను తిన్నగా లాకప్‌కి పంపాలి.'

# నారయ్య

'నారయ్యా ! .... నువ్వింతటి ఘటికుడవని నాకు ముందే తెలియదు. నువ్వు గతాన్ని మర్చిపోయావు. ఓ నాడు తిండికి లేకుండా వీధమ్మట పడి తిరుగుతుంటే పాప తీసుకొచ్చింది. ఆదరించి, దయతల్చి పనిచ్చాను. పదిరూపాయలు పారేస్తే నీలా పనిచేసేవాళ్ళు ఈ ఊళ్ళో వెయ్యిమందున్నారు. నీకు తిండిపెట్టి, బట్టలిచ్చి, జీతం కూడా ఇచ్చి మా కుటుంబంలో ఒకవ్యక్తిగా పరిగణించినందుకు తగినశాస్తి చేశావు .... నువ్వు మంచివాడవని పొరబడ్డాను.'

నారయ్య ఇంక వినలేక చెవులు మూసుకున్నాడు.

వెనక్కి తిరిగి చూసేసరికి తల్లి అక్కడ లేదు.

వందగజాల దూరంలో ఆమె వడివడిగా నడిచిపోతోంది. గుండె గుభేలుమంది. అతనూ పరుగెత్తాడు. ఆమె మరింత దూరమైంది. పెద్ద ప్రవాహం వచ్చి ఆమెను తీసుకుపోయింది.

నారయ్య ఉలిక్కిపడి మేలుకున్నాడు.

లేచికూర్చుని తలగడకింద చూసుకుంటే, వందరూపాయలు భద్రంగా ఉన్నాయి. గడియారం పన్నెండు కొట్టింది. ఇంతసేపూ జరిగిన చిత్రసంఘటనల్ని నెమరువేసుకున్నాడు. అది కలని అతను నమ్మలేకపోయాడు. అంతరాత్మ ఈవిధంగా తనకు సద్బోధ చేస్తోందిగామోలు! పక్కగదిలోంచి సంభాషణ వినిపించింది.

'నా అనుమానం నారయ్యే ఈపని చేసి ఉంటాడు... పాప అమాయకురాలు కాదు... పరాయి మనుష్యులదగ్గర గడుసుతనంగా మసలుకుంటుంది... కూడా వీడున్నాడుకదాని పరధ్యానంగా ఉండిఉంటుంది. అదనుచూసి అపహరించాడు. అదీకాక తల్లికి పంపేందుకని వందరూపాయలు అడిగాడు పొద్దున్న. జ్ఞాపకం ఉందా మీకు ? .... ఇవ్వనని మీరు కసిరికొట్టారు. రేపు నిలదీసి అడగండి. నిజం బయటపడుతుంది.'

సుభద్ర మౌనంలో ఇంతటి అంతరార్థం ఉందని నారయ్య ఊహించలేదు.

జనార్దనంగారు నవ్వారు.

'నువ్వు పొరబడుతున్నావు. మనుష్యుల మనస్తత్వాలు సరిగ్గా అర్థంచేసుకునేస్థితికి నువ్వింకా రాలేదు. నారయ్య చాలా మంచివాడు. అలాంటి పనెప్పుడూ చేయడు. ద్రోహబుద్ధి నిజంగా

బ్యాంకులో చొరబడి రు. 2 లక్షలు ఎత్తుకుపోయిన ఒక గజ దొంగ కోసం పోలీసులు మూడేళ్లు గాలించారు. చివరకు ఒకరోజున అతడు సెకండ్ హాండ్ సైకిల్ దొంగిలిస్తుండగా పట్టుబడ్డాడు.

డి. రాజయ్య (ఖమ్మంమెట్టు)

ఉండివుంటే, ఆ చిన్నగొలుసుతో తృప్తిపడడు. మనం వాణ్ణి పూర్తిగా నమ్మాం .... అలాంటప్పుడు బీరువాలోంచి నగలన్నీ మూటకట్టి తీసుకుపోవచ్చు—కాని అలా చేయడు—చేయలేడు. ఒకరిసొత్తు — పూచికపుల్లయినా—అతని కక్కర్లేదు. ఉదయం కసిరికొట్టి పనిలోంచి పొమ్మన్నాను. పోయాడా మరి ? .... అమాయకుడు. మనల్నే నమ్ముకున్నాడు. అందుచేత వాణ్ణి అనుమానించటం తప్పు. పాప తెలివైందేకాని, చిన్నపిల్ల. దాన్ని మోసగించటం బ్రహ్మవిద్య కాదు. నిజానికి నువ్వుకూడా నారయ్యను పూర్తిగా అనుమానించటంలేదు. వాడు దొంగనే అభిప్రాయం నీకు కలిగివుంటే సాయంత్రం పరమాన్నం ఎందు కిచ్చావ్ ? .... నేను స్వెట్టరు అదీ కొనిస్తానా ? మనం పైడను చూసి నిజమనుకోకూడదు.... అది చాలా ప్రమాదకరమైంది.'

ఆ తరువాత ఏం మాట్లాడుకున్నదీ నారయ్య వినేస్థితిలో లేడు. నిశ్శబ్దంగా తనలో తాను కుమిలికుమిలి ఏడ్చాడు. సహృదయం ఉన్న మనిషి న్యాయవిరుద్ధంగా ఎన్నడూ నడుచుకోలేడు. అలా నడుచుకున్నా, వెంటనే పశ్చాత్తాపపడి, తన్ను తాను సరిదిద్దుకుంటాడు.

ఒంటిగంటకు నారయ్య చిన్న కాగితంముక్క మీద వెన్నెల వెలుగులో ఏదో రాశాడు.

*     *     *

ఆమర్నాడు పొద్దున్న నారయ్య ఎక్కడా కనపడలేదు. కంగారుతో ఇల్లంతా వెతికారు. దొడ్డి తలుపులు తెరచివున్నాయి. సుభద్ర, జనార్దనం ఒకరివంక ఒకరు ప్రశ్నార్థకంగా చూసుకున్నారు.

'నాన్నారూ ! .... వంటింటో ఈ కవరు కనిపించింది .... ' అంటూ పరుగెత్తుకొచ్చి పాప అందించింది.

జనార్దనంగారు అందులో ఉన్న ఉత్తరం తీసి చదువుకున్నారు.

'అయ్యగారూ ! .... నేను దొంగను. బుల్లెమ్మగారి గొలుసు నేనే తీశాను. మా అమ్మకు డబ్బు పంపుదామని .... అయ్యగారు ! మీరు ధర్మాత్ములు. మీ మనసు మంచిది. మీరు దేవుడివంటివారు. మిమ్మల్ని మోసంచేస్తే నాశమౌతారు ఎవరైనా. గొలుసు అమ్మగా వచ్చిన వందరూపాయలు ఈ కవరులో ఉన్నాయి. నన్ను క్షమించండి... మీ ఆదరణకు నేను తగను. నేను వెళ్ళిపోతున్నా. ఎప్పుడైనా మీ కెదురుపడితే నాముఖం చూడకండి అయ్యగారూ ! నేను పాపిని...'

జనార్దనంగారు విషాదంగా నవ్వారు.

'పిచ్చి నారయ్య ! నన్ను అర్థంచేసుకోలేదు. ఏదో కోపంలో సాయంచేయనని కసిరికొట్టాను కాని—ఆఫీసుకు వెళ్ళగానే అతని తల్లికి రెండు వందలు మనియార్డరు చేసినసంగతి అతనికి తెలియదు. నేనుకూడా చెప్పటం మర్చిపోయాను' అన్నారు.

సుభద్ర ఆ ఉత్తరం లాక్కుని చదువుకుంది.

తోటలో నారయ్య శ్రమపడి నీరుపోసి పెంచిన పూలమొక్కలు, రంగురంగుల పువ్వులతో కిలకిల నవ్వాయి. ఆ పువ్వుల్లో ఉండే స్వచ్ఛత నారయ్యహృదయంలో కూడా ఉంది.

జనార్దనరావుగారు నిట్టూర్చారు. ★